# అశుభము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ ఎమ్. ఎ.

ఇందువచ్చు పాత్రలు :

1. రంగధామరావు
2. మోహన్
3. లీల
4. రామకృష్ణ
5. రామశాస్త్రి
6. గంగాధరం

(మీటింగు హంగామా)

ఒకటవ రంగము

(ఒక మేడవెనుక తోట. ప్రొద్దుగ్రుంకు సమయము. లీల పదునాల్గేండ్ల పడుచు. చామన చాయ. బక్కపలుచనిది. కనుల కద్దాలు. చేతికి బంగారపు గడియారము. ప్రక్క పాపిడి. వాయిలు చీర. మోహనరావు వయసిరువది రెండు. వ్యాయామము చేసిన శరీరము, బుష్ కోటు. చేతిలో టెన్నిసు బ్యాటు. టెన్నిసు షూస్. క్రాపింగు మిక్కిలి నల్లనివాడు. కావి ముక్కు పెద్దది. దవుడలు పలుచన. కను లెప్పుడు నవ్వుచుండును.

మోహన్—లీలా ! నీ విప్వేళ కాలేజీకి రాలేదేం ?

లీల—నేను రాకపోతేనేం ? నీవు వచ్చావు గదా ?

మో—టెన్నిను కోర్టునుండి యెకాయెకి వచ్చాను. సరేగాని నన్నీ దొడ్డిగుమ్మంద్వారా తోటలోనికి తెచ్చావేం ? హాలులోనికి రాకూడదా ?

లీల—మా నాన్నగారు నిన్ను మా యింటికి రానీయవద్దన్నారు. నిన్నుగురించి ప్రిన్సిపాలుకు రిపోర్టుచేస్తారట.

మో—ఏమని ?

లీ—నీవు నన్ను వశపరచుకొన్నావని. నా శీలము భంగపరుస్తున్నావని. నీమూలంగా నాకు సంబంధాలు రావటంలేదని.

మో—ఏం చేస్తా డాప్రిన్సిపాలు ? పైగా నీకు సంబంధాలు వస్తే నేను వద్దన్నానా ?

లీ—నోటితో అనాలా ?

మో—మరి నాకేయిచ్చి పెళ్ళిచేయరాదు ?

లీ—నీకు ఆస్తి లేదాయెను. పైగా నీవందగాడవు కావట.

మో—అదేమిటి ? న న్నాయన చేసికొంటాడా యేమిటి ? చేసికొనేవాళ్ళకు అందంగానే ఉన్నాగా ?

లీ—ఈ రోజుల్లో ఎద్దు నడిగి గంత యెవరు కట్తారు ?

మో—ఈరోజుల్లోనే కాదు. ఏరోజుల్లోనూ అంతే. మీ నాన్న చూడు. సంఘసంస్కారి అని పేరు. నీకు పద్నాలుగేండ్లు వచ్చేవరకూ పెండ్లి చేయలేదు. స్కూలుకుపంపి చదివిస్తూనే యున్నాడు. స్త్రీ పురుషులు కలిసియుంటే ఏదో యొక సంబంధం కలవటంలో ఆశ్చర్య మేముంది ?

లీ—స్కూళ్ళల్లో ఇందుకనేనా చదువుకో మంటారు ?

మో—ఇందుకే చదువుకోమనరు. ఇది యౌవ్వనంలో ఉన్నవాళ్ళకు సహజం. పైగా ఇందులో తప్పేమున్నది ? ని న్నెవ్వరికో యొకరి కిస్తారంటావా ? లేదంటావా ? అది నాకే యీయవచ్చుగా !

లీ—ఇచ్చేవాళ్ళ ఇష్టాన్నిబట్టా నీ యిష్టాన్నిబట్టా ?

మో—ఇవ్వ బడేవాళ్ళ యిష్టాన్నిబట్టి.

లీ—అది పుస్తకాలల్లో మాట.

మో—కాదు. తోటలో మా ట కూ డా ను.

(కౌగిలించుకొందురు)



http://www.maganti.org

[మేడ దొడ్డిగుమ్మమునుండి రామకృష్ణ ప్రవేశించును. ఏభై యేండ్లు. తలా మీసాలు నెరసినవి. మనిషి బాగుగా లావు, కొంచెము పొట్టివాడు. ఎఱ్ఱనివాడు. పెద్ద ప్లీడరు. ప్రవేశించి అతడు వీరిద్దరు కౌగిలించికొనుట చూచును.]

లీ—(తండ్రిని చూచి) అరుగో మా నాన్నగారు వచ్చారు. మన్ని చూచారేమో? నీవీ చెట్టు చాటుగా దొడ్డిగుమ్మము తలుపు తెరచే ఉంది. పారిపో.

[రామకృష్ణ తాను దొడ్డిగుమ్మము తలుపు దగ్గరకే పోవును. మోహనరావు కనిపించును.]

రా—ఎవరు నీవు?

మో—నేనండీ. నమస్కారం.

రా—తోటలోని కెందుకు వచ్చావు?

మో—మీ అమ్మాయికి మొన్న నా "మెకాలే" యిచ్చాను. తీసికొందామని మీ యింటికి వచ్చాను. నేను వచ్చేవేళకు లీల ఈ దొడ్డిగుమ్మంలో నిలుచున్నది. లోపలకి రమ్మన్నది వచ్చాను.

రా—ఇంక మా అమ్మాయి కాలేజీకి రాదు. నీవు మా యింటికి రావద్దు. తెలిసిందా?

మో—తమరు—

రా—తమరూ లేదు గిమరూ లేదు. నీవు మా యింటి చుట్టుపట్ల కనుపించావా?

మో—మరి—

రా—నోరు ముయ్యరా. గాడిదె బద్మాష్. నీవు బ్రతక దలుచుకొంటే మా అమ్మాయితో జోక్యం కలిగించుకోకు. ఏం అల్లరి చిల్లరి వాళ్ళ మనుకొన్నావా? మర్యాదా మన్నా లేదా? ఆ స్నేహితులూ ఈ స్నేహితులూ కుట్టించిపెట్టిన చొక్కాలు తొడుక్కొని టెన్నిసు బ్యాటు పట్టుకొని తిరిగితే గొప్ప అనుకొన్నావు కాబోలు వారాలుచేసికొని బ్రతికే వెధవవు.

మో—దానికేమిలెండి. నేనే బియ్యే ప్యాసైతే యేదో మంచి ఉద్యోగం కావచ్చు.

రా—అయితేకా. మా యింటికి రావద్దు. నేను సాధువుగా చెప్పుతున్నాను. నేను మంచివాడిని కాదు. నేను చదువుకొనే రోజుల్లో రౌడీనే. నా సంగతి నీవు వినేవుంటావు. నాతో విరోధం పెట్టుకొని చాలామంది బ్రతికిలేరు. వెళ్లు.

[మోహన్ వెళ్ళిపోవును. రామకృష్ణ తలుపు వేసి లీల దగ్గరకు వచ్చును.]

రా—నీవు వాడిని యెందుకు దొడ్డిగుమ్మంవెంట రానిచ్చావు వీడంత తెలివిగలవాడు లేడా? వీడంత చదువుకొన్నవాడు లేడా? వీడంత అందగాడు లేడా? అడుక్కొని తినే వెధవ. ఊళ్ళో అప్రతిష్ఠా. మిమ్మల్నిద్దర్ని గురించి గోడల నిండా కాగితా లంటించడమా? సిగ్గుండాలి. ఏదో చదువుకొంటావనుకొంటే ఇవా పనులు? ఒళ్ళు దగ్గరపెట్టుకొని ఉండు. ఇవ్వేళ కాలేజీకి వెళ్ళావా?

లీ—మీరు వెళ్ళవద్దన్నారని వెళ్ళలేదు.

రా—వెళ్ళ వద్దన్నా రనేమిటి? ఇంక నీవు కాలేజీకి వెళ్ళవు. నీ చదువు మంగళం పాడింది. ఒక పెద్ద అగ్రహారీకుల సంబంధం వచ్చింది. పాతిక వేలు కట్నం ఇస్తున్నాను. దొడ్లూ దోవలూ వాళ్ళకు లక్ష ఉన్నవి. అతడు యం. ఏ. ప్యాసైనాడు. ఢిల్లీలో యేదో ఉద్యోగంకూడా నట. బంగారంవంటి జీవితంలో నిప్పులు పోసుకోకు. వీ డెక్కడ దొరికేడే? మసిబొగ్గు ముండాకొడుకు?

(నిష్క్రమింతురు)

## రెండవ రంగం

[మోహన్ గది. గది నిండా పుస్తకాలు. సిగరెట్టు పీకలు. గది చిన్నది. గోడకు టెన్నిసు బ్యాటు తగిలించి ఉంటుంది. పొగక్రమ్మిన డీట్స్ లాంతరు. మోహన్ లీల.]

లీల—ఈ గదిలోకి ఒకళ్ళువస్తే ఇద్దరు వెళ్ళాలి.

మో—ఒకళ్ళువస్తే ఒకళ్ళేగా వెళ్ళింది? ఇద్దరూ వెళ్ళితే నీవు రానే అక్కరలేదు.



http://www.maganti.org

లీ—ఆయన ఎవరు ?

మో—ఎవ రేమిటి ? యీ గది ఆయనదే. నే నీ గదిలో వట్టి కరువు భత్యం. అతడు చాలా ధనం కలవాళ్ళ బిడ్డ. అతని మూలంగానే నా చదువు సాగుతోంది.

లీ—ఆయన యేమనుకొంటాడు.

మో—అనుకొనేదేమిటి? అతని కిదివరకే తెలుసు. నీవు నన్ను ప్రేమించావని.

లీ—అయితే నీవు నన్ను ప్రేమించలేదా ?

మో—స్త్రీ పురుషుల్లో ఇదే చిత్రం. స్త్రీ ప్రేమించటం ప్రధానం. పురుషు డెల్లాగూ ప్రేమిస్తాడు.

లీ—అంటే నీవు ఎవ్వాళ్ళని బత్తే వాళ్ళనే ప్రేమిస్తావన్నమాట.

మో—మరి నిన్ను ప్రేమించాను కదూ.

లీ—అయితే నేను ఎవళ్ళుపడితే వాళ్ళల్లో లెక్క అన్న మాట.

మో—పిచ్చిదానా. మొదట యెవ్వాళ్ళుపడితే వాళ్ళే. తరువాత వాళ్ళే.

లీ—ఇందు కనే నోయి నీవంటే ప్రేమ నాకు.

మో—మీ నాన్నకూ ఇందుకనే నేనంటే ద్వేషం.

లీ—ఆయనకు నీ సంగతి తెలియదు.

మో—ఆయన నీ తండ్రి అవటం మూలంగా నేనే మంటానికి వీలులేదు. కాని ఆయనకు వివేకం ఏమీలేదు. ఆయనకు డబ్బు ఒక్కటే తెలుసు. మరి పరీక్షలన్నీ యూనివర్సిటీ ఫస్టున ప్యాసయ్యాడు. షేక్స్పియరు అప్పచెప్పమంటే అప్పచెప్తాడు. కాని రసజ్ఞత అన్నది యేమీలేదు. మనిషిలో మానవత్వమే లేదు. ఒక హృదయాన్ని కదిలించే ఘట్టం చదువుతూ ఉంటామూ అల్లా మొద్దల్లే కూర్చుంటా దేమిటి ?

లీ—ఆయన కెప్పుడూ ఏదో ఒక పని.

మో—సరేగాని ఇల్లావస్తే మీ నాన్నకు తెలిస్తే ఊరకొంటాడా ?

లీ—పదిరోజులమట్టీ సినీమాకు వెళ్ళుతానని. ఇవ్వేళ నేను, కమలా వచ్చాం. కమలను వాకిట్లో నిలుచోబెట్టి వచ్చాను.

మో—చాలా తప్పు చేశావు. మీ నాన్న విషయం నీకు తెలియదు. నాకు తెలుసు. రెండు మూడు శవాలు ఆయన చేతిమీదుగా వెళ్ళినవి. "లా" అంత బాగా తెలుసుకనక తనమీదికి రాకుండా బనాయించాడు. నన్నుగురించి నాకు భయం లేదుగాని నిన్నేంచేస్తాడో నాకు తెలియదు. లీలా, మనుష్యుల ప్రకృతు లనేక రకాలుగా ఉంటవి. ఒకళ్ల ప్రేమించి ఆ ప్రేమ సఫలం కాకపోతే మరణిస్తారు. కొందరు కొన్నాళ్ళకు మరచిపోతారు. మరికొందరు ప్రేమించనేలేరు. వాళ్లయందున్న కామోద్రేకం ప్రేమవలె కనిపిస్తుంది.

లీ—మన ప్రేమ యెల్లాంటి దంటావు ?

మో—నేను చెప్పితే బాగుండదు. అయినా చెప్పుతాను. మన మిద్దరమూ ప్రేమ విఫలమైతే చనిపోయేవాళ్ళము కాదు. అంటే యేమి ఆశ్చర్యం లేదు. ప్రేమ విఫలమైతే చచ్చిపోయేవాళ్ల పది లక్షలమందిలో ఒక ళ్లుంటారో లేదో కనుక పెద్ద విచారించతగింది యేమీలేదు.

లీల—నేను మరచిపోను.

మో—నీవు ఆ తల్లి కడుపున పుట్టావుగనుక అల్లాగైనా అంటున్నావు. నీ వా తండ్రి కడుపున పుట్టకపోతే నీ ఆమాటలో పూర్తిగా నిజం ఉండేది.

లీ—మరి నీ వెట్లాంటివాడవు ?

మో—నేనా- నిన్ను ప్రేమించటమేమిటి? నే నసలు తిండిలేనివాడను. నీవు ఆగర్భ శ్రీమంతుల యింట్లో పుట్టిన బిడ్డవు. ఒక దుర్యోగం చమత్కారంగా ఉంటుంది. అసలు మొదలుపెట్టుతూనే అసంభవమైన వస్తువుమీదకు పోవటమేమిటి ? మొదటి వాంఛ. పురిటిలో సంధు కొట్టినట్టు.

లీ—మోహన్- నిన్ను చూస్తే నాకు భయం వేస్తోంది. నీ వింకోవిధంగా అయితే బ్రతకను సుమీ !



http://www.maganti.org

మో—ఏమీ ఫర్వాలేదు. మీ నాన్న నీ ప్రాణాన్ని గాజు పంజరాల్లో పెట్టి తప్పించుక పోకుండా చూస్తాడు.

లీ—నీతో చెప్పిపోవటానికి వచ్చా.

మో—లగ్నం పెట్టారా?

లీ—మోహన్-మోహన్

మో—ఎందుకు లీలా అంత భయం? నే నేతప్పు చేశాను. నాకు తెలిసి నిన్ను ప్రేమించాను. ఈ జీవితానికి ఈ కాస్త సుఖమైనా ఇద్దామనుకొన్నాను.

లీ—నా కర్థం కావటంలేదు.

మో—నీ కేమీ నష్టంలేదు. ఆ అమ్మాయి యెంత సేపు నిలుచుంటుంది వాకిట్లో? మరి బాగుండదు వెళ్లు.

లీ—మోహన్! నిన్ను మరిచిపోలేను.

మో—నీవు నా ప్రాణానివి ని న్నేమనను? సరే వెళ్లు. మరచిపోకు.

లీ—మోహన్! క్షమించు. నాకు కాళ్లూ చేతులూ కట్టివేసి యీ పెండ్లి చేస్తున్నారు.

మో—అల్లాగే సినీమాకు పంపించారుగా?

లీ—ఏమిటో? క్షమించు.

మో—నీవు చేసిన తప్పేమీలేదు. పద.

[లీల వెడలిపోవును. రంగధామరావు ప్రవేశించును.]

రం—అది యేమిటల్లా కూర్చొన్నావు?

మో—ఎల్లా కూర్చున్నాను?

రం—ప్రాణాలు పోయినవానికిమల్లె కూర్చున్నావు.

మో—ప్రాణాలు కాదు. "ప్రాణం" ఇప్పుడేగా వెళ్ళిపోయింది చూచావు.

రం—ఆ సంగతి తెలిస్తే చెయ్యిబట్టుకొ లాక్కొని వచ్చేవాడినే. ఏదో "రొమాన్సు"ను కొన్నాను.

మో—నా మొగానికి తోడదికూడాను.

రం—ఏం పేదవాళ్లయితే బ్రతకకూడదేమిటోయి.

మో—పేదవాళ్లయితేకాదోయి నావంటివాళ్లయితే. నావంటివాళ్లు పుట్టకూడదు.

రం—మరి పుట్టావుగా.

మో—పుట్టా నంటానా?

[రంగధామరావు నవ్వి]

రం—నిన్నుగురించి నాకేమీ తెలియటంలేదోయి. ప్రతిదీ హాస్యంగా మాట్లాడుతావు. వెనక కుమిలిపోతూ ఉంటావు.

మో—సరేగాని మా నాయనగారికి రమ్మని టెలిగ్రాం ఇస్తాను. ఆయన ఎల్లుండి వస్తారు. ఒక్క రెండు రూపాయలుంటే ఇవ్వాలి నీవు.

రం—తీసికో. ని న్నెప్పుడు కాదన్నాను?

మో—క్షమించు. నీ డబ్బు చాలా తిన్నాను. ఇక ని న్నెప్పుడు అడగను.

రం—ఇదేమిటి ఇట్లా మొదలుపెట్టావు? లీల పెళ్లటకాదూ? చెప్పటానికి వచ్చిందా? ఈ పెళ్లిళ్లు ఒక చమత్కారమోయి.

మో—రంగా చెప్తున్నా విను. లీలకు నాకు నిజంగా ఏమీ సంబంధంలేదు. ఒకటి రెండుసార్లు కౌగిలించుకొన్నాను. అంతే చేసింది తప్పు.

—[తెర]—

## మూడవ రంగం

[రంగధామరావు గది. రంగధామరావు బక్కపలుచనివాడు. చామన చాయ. ఇరువది ఏండ్లు ఖద్దరు లాల్చీ. సగము మీసాలు. కళ్ల కద్దాలు. రామశాస్త్రి యేబది యేండ్లు పల్లెటూరివాడు. ఇతడు మోహన్ తండ్రి. గంగాధరం నలుబది యేండ్లవాడు. పల్లెటూరివాడైనా కొంచెం లౌక్యంలో తిరిగేవాడు. క్రాపింగు లేకపోయినా ముఖక్షౌరం, ఇస్త్రీచెయ్యని చొక్కా ఉత్తరెయ్యాలు. రామశాస్త్రి మోకాళ్లమీద తల పెట్టుకొని యేడ్పుచూ కూర్చుండును. రంగధామరావు దిగాలుపడి నిలుచుండును. గంగాధరం గోడ కానుకొని కూర్చుండును.]

రా—(ఏడ్చుచు) ఓరి తండ్రీ నీ వేమో కొంప బాగుచేస్తా వనుకొన్నానురా.



http://www.maganti.org

గం—బావా! ఊరుకో. వాడికీ మనకు ఋణం లేదు. రంగధామరావుగారూ! ఏమిటండీ యీ కథ? ఆ పిల్ల యెవరు? దానికీ వీడికీ సంబంధం యేమిటి?

రం—ఈ ఊళ్ళో రామకృష్ణగారని ప్లీడ రున్నారు.

గం—ఎరుగుదునండీ. నెలకు వెయ్యి పదిహేను వందలు వస్తని. చాలా పెద్ద ప్లీడరు, ఇదికాక పెద్ద ఆస్తికలవాడు కూడాను.

రం—వాళ్ళ అమ్మాయి. ఆ అమ్మాయి పేరు లీల. ఇతని తెలివితేటలకు ఆ అమ్మాయి ప్రేమించింది. మొదట ఇతదేమీ తూగలేదు. ఆ అమ్మాయే ఇతని నోట్సూ అదీ అడిగిపుచ్చుకొంటూండేది. చివరకు ఒకటి రెండు ప్రేమ ఉత్తరాలు వ్రాసింది.

గం—ఆ ఉత్తరా లున్నవా?

రం—మీరే కదండీ గంగాధరంగారు.

గం—ఔను. వాడు మా మేనల్లుడే.

రం—ఆ ఉత్తరాలుంటే మీరేదైనా వ్యవహారం చేస్తారని నాతో చెప్పాడు. అవి తగులబెట్టాడు.

గం—వట్టి తెలివితక్కువ దద్దమ్మలు.

రా—వాళ్ళమీద వ్యవహారాలు మన కెందుకోయి. బాబూ రంగధామ! నీవు గదిలోనే ఉన్నావు గదా వాడిట్లా ఎల్లా చెయ్యటానికి వీలైంది.

రం—మొన్నరాత్రి ఆ అమ్మాయివచ్చి తాను వివాహం చేసికొంటున్నానని చెప్పింది, మీకు టెలిగ్రాం ఇచ్చేందుకు నన్ను రెండు రూపాయలివ్వమన్నాడు. నేను ఏమ నిస్తావని అడిగాను. "మావాళ్ళు నాకు సంబంధం కుదిర్చారు. నేను వెంటనే పెళ్ళిచేసికొంటాను" అని చెప్పాడు. నిన్న మధ్యాహ్నం తనకు తలనొప్పిగా ఉంది కాలేజీకి రానన్నాడు. నేను కాలేజీనుండి, మీరు ఊరినుండి ఒక్కసారే వచ్చాం.

రా—నాయనా! వాడు నాకెందుకు దక్కుతాడోయి. జ్యోతిష్కులు చెప్పనే చెప్పారు. వాడి కిప్పుడు పెద్ద గండం ఉందని. ఇది దాటితే డెబ్బయి నాలుగేండ్లు ఆయుర్దాయమని గొప్ప అదృష్ట జాతకుడని చెప్పారు. నాకు భగవంతుడు యాయవారపు బ్రతుకు వ్రాసి ఉంటే వాడెందుకు బ్రతుకుతాడు?

[దారివెంట ఊరేగింపు మ్రోత వినుపించును]

గం—ఆ మ్రోత యేమిటి బాబూ?

రం—చూచి వస్తాను. (బయటకు వెళ్ళును)

రా—గంగాధరం! ఇంకా మన మెందుకు ఇక్కడ? పోదాం. వాడి తల్లికి యింతవరకు తెలియదాయె. నీవు ఈ అస్థికలు తీసికొవెళ్ళి నీవేం చేసుకొంటావో చేసికో. నా దారి నేను చూచుకొంటాను.

గం—ఏమిటయ్యా బావా ఆ మాటలు? తక్కిన వాళ్ళేం కావాలి?

రం—(ప్రవేశించి) రామకృష్ణగారు ఈ ఊళ్ళో టౌనుహాలు కట్టించేందుకు పాతికవే లిచ్చారు. ఒక వెయ్యి గజాల స్థల మిచ్చారు. ఇవ్వేళ దానికి శంకుస్థాపన. ఆ ఊరేగింపు మీటింగుకు వెళ్ళుచున్నారు.

రా—ఆయన గొప్పవాడే. ఉదారుడే. నా కర్మం ఇలా కాలిందికాని,

గం—ఆ ఉదారుడే. ఆ పాతికవేలూ వీడి కిచ్చి పిల్ల నిస్తే సరిపోదూ? ఇప్పటి వాళ్ళందరికీ ఇదే రోగం. పబ్లిక్ సంస్థలకు వేలు వేలు క్రుమ్మరిస్తారు. సభలు అంటే వేలు వేలు చందాలిస్తారు. ఒక పేదవానికి పది రూపాయలు ఇవ్వటమంటే ప్రాణంపోతుంది. ఈ వెధవలకు మెరమెచ్చులు కావాలి. ఆముష్మికం అక్కర లేదు.

రం—ఆ మీటింగుకు పోదాం.

రా—మన కెందుకు బాబూ మీటింగులు?

రం—కాదండీ! మన కక్కడ కొంచెం పని ఉంది.

గం—సరే మీటింగుకు వెళ్లుదాం.పదవయ్యా బావా!

రా—ఈ అస్థికలతోనేనా?

రం—ఆ. అస్థికలతోనే.

—[తెర]—



http://www.maganti.org

## నాలుగవ రంగం

[పెద్ద దొడ్డి. పది కుర్చీలు వేసిఉన్నవి. సన్నాయి పాడుచున్నారు. పెద్ద సభ చేరింది. నడిమి కుర్చీమీద కలెక్టరుగారు ప్రక్కనే రామకృష్ణ. మరికొందరు పెద్దలు కూర్చున్నారు. మీటింగు జరుగుతుండగా గంగాధరం, రామశాస్త్రి, రంగధామరావు ముగ్గురూ ప్రవేశింతురు]

రం—(రామకృష్ణ దగ్గరకుపోయి) అయ్యా! ఇవ్వేళ మీరు నా ఉపన్యాసం వేశారు. నాకు పని ఉన్నది. మొదటనే కొంచెంసేపు మాట్లాడి వెళ్లిపోతాను.

రామకృష్ణ—అల్లాగే తప్పకుండా. నీవు కాలేజీలో పెద్ద అరేటరవు. నీవు మాట్లాడకుండా ఎల్లాగయ్యా ఇవ్వేళ? (లేచి నిలుచుండి) ముందర రంగధామరావుగారు మాట్లాడుతారు. ఈయన కాలేజీలో బి. ఏ. చదువుచున్నారు. తెలుగులో ఇంగ్లీషులోకూడ అమోఘంగా మాట్లాడుతారు. న్యూకాసిల్‌కు బొగ్గులు తీసుకొని వెళ్ళటమేమిటి? ఆయననుగురించి యీ ఊళ్ళో తెలియని వారెవరు? లే రంగధామం మాట్లాడు.

రం—(లేచి) సోదర సోదరీమణులారా! నా హృదయం దుఃఖంచేత క్రుంగిపోతోంది. నా స్నేహితుడు మోహన్‌రావు ఆత్మహత్య చేసికొన్నాడు. ఆయన తండ్రి మేనమామ ఇద్దరూ వచ్చారు. ఆ చెయ్యవలసిన పనికాస్తా చేసికొన్నారు. అదుగో, ఆ దూరంగా కూర్చున్నది వారిద్దరే.

రా—ఇప్పుడా ప్రసక్తి యెందుకులే? కానివ్వు.

[సభలోనుండి ఒకడు ఎందుకుపోయినా డాకుట్టివాడు? ఇంకొకడు ఎందుకా రామకృష్ణగారి కూతుర్ని ప్రేమించాడు. ఆవిడకు వేరే సంబంధం కుదిర్చారు. అందుచేత "పొటాస్ సైనేడ్" తిన్నాడు. ఇంకొకడు అయితే ఆపిల్ల యేమైంది? మరొక్కడు ఆవిడకేం లక్ష రూపాయల ఆస్తికల మొగు డొచ్చాడు.]

మరొక్కడు—కట్నం ఎంత?

ఇంకొకడు—పాతిక వేలు.

(సభంతా గందరగోళంగా ఉంది)

రం—అయ్యా! కలకలం ఆపండి. నేను నాలుగు మాటలు చెప్పదలచుకొన్నాను. (సభంతా నిశ్శబ్దం) మీలో కొందరనే మాటలు వింటునే ఉన్నాను. రామకృష్ణగారు అల్లుడికి పాతిక వేలు ఇస్తున్నారు. ఈ టౌనుహాలుకు పాతిక వేలు ఇచ్చారు. ఆ అల్లుడి కిదివరకే రెండు లక్షల ఆస్తి ఉన్నది. ఆయన ముఖాన తీసికొనివెళ్ళి పాతికవేలు పోయకపోతే పేదవాడు తెలివిగలవాడు ఆ కుఱ్ఱవాడు బాగుపడేవాడుగదా! తన కూతురు సుఖపడేది గదా!

రా—నోరుముయ్. కలెక్టరుగారూ మీరు ప్రెసిడెంటు. ఇతన్ని తక్షణం దింపివేయించాలి.

రం—మాట్లాడ మనటం, దిగమనటం రెండు మీవంతేనా? ఈ టౌనుహాలు కట్టిస్తారయ్యా దీనివల్ల ప్రయోజన మేమిటి? ఇందులో నెలకొక పది మీటింగులు పెట్తారేమో? టౌనుహాలులు చూస్తున్నాం కదూ! అక్కడ కెవ్వరూ రారు. టౌనుహాలుల ధర్మకర్తల ఇష్టంలేకపోతే మీటింగు పెట్టనివ్వరు. ఇది అనవసరమైన ప్రజాభోగ మనే పేరుతో నాశనంచేసే డబ్బు.

కలెక్టరు—నీవు వెంటనే దిగిపో.

రం—చిత్తం. దిగిపోతాను. ఈ రామకృష్ణగారు చేసిన తప్పునకు మీ లాలో శిక్షలేదు. మీ న్యాయశాస్త్రం ఒక చచ్చు న్యాయశాస్త్రందానికి ముక్కుమొగం లేదు. ఆ కొడుకు అస్థికలు పుచ్చుకొని ఆ తండ్రి అక్కడ కూర్చున్నాడు,

రా—అస్థికలు తెచ్చారా! శుభమా అని మేము టౌనుహాలుకు శంకుస్థాపన చేస్తుంటే ఇక్కడకు అస్థికలు తెస్తాడా? అశుభంగా: కలెక్టరుగారూ ముందర అతన్ని వెళ్లగొట్టాలి.

కలెక్టరు—పోలీస్. (నలుగురు పోలీసులు హాజరు)



http://www.maganti.org

ఈ రంగధామరావును లాగెయ్యండి. ఆ అస్థికలున్నాయన్ని బయటకు తరిమివెయ్యండి.

(సభలో పెద్ద అల్లరి)

ఒకడు—రంధామరావుది తప్పేమున్నది ?

రెండవవాడు—ఏమీ లేని నాదికి ఇవ్వమంటాదేమిటి ?

3 వ వాడు—లేకపోవట మేమిటోయి ? యేభై వేలిస్తే ఉందంటున్నాడుగా !

4 వ వాడు—ఊరికే యిస్తాడోయి.

5 వ వాడు—ఊరికే యెవ రివ్వ మన్నారోయి కూతురుతోపాటే యివ్వమన్నారు.

6 వ వాడు—అదేంటయ్యో శుభం అంటూ ఉత్సవం చేసికొంటూంటే ఇక్కడకు అస్థికలు తీసికొని రావటం ఏమిటి ?

7 వ వాడు—శుభ మేమి టోయి ? ఎవ డింట్లో అన్నా ఒడుగా పెండ్లా ? టౌను హాలుకు శంకుస్థాపనం చేయటం ఒక శుభమా ? ప్రతిదీ శుభమే యీ బుద్ధిహీనులకు.

8 వ వాడు—శుభం కాదేమిటి ? కొబ్బరికాయలు కొట్టడం లేదా ? విఘ్నేశ్వరపూజ చేయడం లేదా ? మనదేశంలో అన్నీ శుభాలే.

9 వ వాడు—పై వన్నీ శుభాలే. లోపల వన్నీ అశుభాలే. ఆ కూతురికి ఆ మోహన్‌రావుకు సంబంధం ఉండే ఉంటుంది. ఇప్పుడు దానికి యింకో మొగుడు. అయినా రామకృష్ణగారు సంఘ సంస్కారేగా ?

10 వ వాడు—ఇందులో తప్పేముంది ? పుస్తె కట్టాలేదు త్రెంపాలేదు.

11 వ వాడు—అసలు ఆవిడ గర్భిణితో ఉందేమో?

12 వ వాడు—మన ఊళ్ళో ఏ ఆకాశరామన్నో ఆ పెళ్లికొడుక్కు ఉత్తరం వ్రాస్తాడు.

13 వ వాడు—అందాకా యెందుకోయి ? ఆ లీల బ్రతికితేగా ? నిన్నటినుండి ఆ అమ్మాయి నిద్రాహారాలు లేకుండా గదిలో తలుపువేసికొని ఏడుస్తూ ఉన్నదట. కూతు రట్లా ఉంటే యీ కటిక ముండాకొడుకు పూలదండలు వేయించుకొందామని యీ మీటింగుపెట్టాడు.

14 వ వాడు—(ఆక్షేపణతో శుభలగ్నం దాటిపోతుందని).

(పోలీసులు వారి ముగ్గుర్ని బయటకు నెట్టివేస్తూ ఉంటారు.)

రా—(బిగ్గరగా యేడుస్తూ) న న్నిట్లా చేసినవాళ్ళు బాగుపడరు. ఈ రామకృష్ణ లమ్డికొడుక్కి నా ఉసురు తగులుతుంది. ఇది శాపం.

—[తెర]—


మావద్ద అన్నిరకాల

కాళీ సీసాలు, కార్కులు, సీసాకేప్స్, కేప్‌సీల్స్

మొదలైనవి దొరుకును

దిసౌత్ ఇండియా బాటిల్ సప్లయింగ్ కంపెనీ,

26, సముద్రముదలి వీధి, : : పి. టి. మద్రాసు.

Source: Press Academy Website, Kinnera Patrika 1949

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan